క్లుప్తంగా

దసరా ఉత్సవాలకు మంత్రికి ఆహ్వానం



మంత్రి కాకాణిని ఆహ్వానిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

పొదలకూరు : పట్టణంలోని శ్రీకన్యకాపరమేశ్వరీదేవి అమ్మవారి దసరా నవరాత్రి ఉత్సవాలను ఈ నెల 15వ తేదీ నుంచి నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆర్యవైశ్య నాయకులు శుక్రవారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఉత్సవాలకు ఆహ్వానించారు. ఆలయ పాలకమండలి చైర్మన్ ఆదూరు వెంకటసుబ్బయ్య, కార్యదర్శి రాచపూటి రామలింగయ్య, కార్యవర్గ సభ్యులు నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయానికి వెళ్లి ఆహ్వానించారు. ఉత్సవాల సందర్భంగా ప్రతి రోజూ అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు ఉంటాయని తెలిపారు.

హెచ్‌ఎంకు ప్రధాని నుంచి ప్రశంసాపత్రం



హెచ్‌ఎం తాటిపర్తి వెంకటేశ్వర్లు

కొడవలూరు: మండలంలోని వెంకన్నపురం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం తాటిపర్తి వెంకటేశ్వర్లుకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నుంచి పోస్టు ద్వారా శుక్రవారం ప్రశంసాపత్రం అందింది. 'పరీక్షా పే చర్చ-2023' పేరుతో కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆన్‌లైన్‌లో ఉపాధ్యాయులకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. విద్యార్థులు పరీక్షల పట్ల ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని, దానిని జయించేందుకు ఈ కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయుల సూచనలు, సలహాలు కోరింది. హెచ్‌ఎం వెంకటేశ్వర్లు ఈ కార్యక్రమంలో పాల్గొని పలు సూచనలు, సలహాలు అందించినందుకు గాను ప్రధాని నుంచి ఈ ప్రశంసాపత్రం పంపారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంకు ఎంఈఓలు జి.వసంతకుమారి, ఎన్.అంకయ్య అభినందనలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పొదలకూరు: పట్టణంలో శనివారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఆ శాఖ ఏడీఈ బి.సురేంద్రబాబు శుక్రవారం తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులలో భాగంగా సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఇందుకూరుపేట: మండలంలోని కొమరిక విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతుల కారణంగా ఆ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ నరసింహ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ ఉప కేంద్రం పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. అలాగే కొత్తూరు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఇందుకూరుపేట, కొత్తూరు పంచాయతీల్లో శనివారం ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టుకు ఎంపిక

నెల్లూరు(టౌన్): రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టుకు నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సూర్యతేజ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థి సూర్యతేజను ప్రిన్సిపల్ తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 6న స్థానిక ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టు ఎంపికలు జరిగాయన్నారు. మహారాష్ట్రలోని కొలహాపూర్‌లో జరగనున్న జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో సూర్యతేజ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎంబీఏ డీన్ ధనుంజయ, పీడీ ప్రసాద్, స్పోర్ట్స్ కన్వీనర్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కెమెరామన్‌కు ఆర్థికసాయం



నెల్లూరు(సెంట్రల్): నెల్లూరులో కెమెరామన్‌గా పనిచేస్తూ అనారోగ్యంతో బాధపడుతున్న జార్జికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షుడు మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి రూ.2 లక్షల చెక్కును అందజేశారు. శుక్రవారం నెల్లూరు రూరల్‌లోని వీపీఆర్ కన్వెన్షన్‌లో జరిగిన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వేణుంబాక విజయసాయిరెడ్డి, రాజ్యసభ సభ్యుడు, పార్టీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో జార్జికి చెక్కు అందజేశారు.

హామీలను సంపూర్ణంగా అమలు చేశాం



వరకవిపూడి పంచాయతీలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ సంపూర్ణంగా అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని వరకవిపూడి గ్రామ సచివాలయ పరిధిలో వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలను మంత్రి చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పాలకులు ప్రచార ఆర్భాటంతో శంకుస్థాపనలు చేసి పనులను విస్మరించారన్నారు. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక శంకుస్థాపన చేసిన ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని పూర్తి చేసి ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 99 శాతం మేర అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గ్రామస్థాయి నుంచే పాలన అందించేందుకు సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం రైతుభరోసా కేంద్రాలు, వైద్యం అందించేందుకు వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసి ఆదర్శప్రాయంగా నిలిచిందన్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయానికి సంబంధించిన ప్రతి వస్తువును అందుబాటులోకి తేవడంతోపాటు ధాన్యం కొనుగోళ్లను సైతం చేపడతున్నామన్నారు. ఈ క్రమంలోనే గత నాలుగేళ్లుగా ధాన్యానికి గిట్టుబాటు ధర లభిస్తుండడంతో రైతుల ముఖాల్లో సంతోషం కలిపిస్తుందన్నారు. అదేవిధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న చుక్కల భూముల సమస్యలను పరిష్కరించి రైతులకు ప్రయోజనం చేకూర్చారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రూ.2,750 అత్యధిక పింఛన్ అందిస్తూ వచ్చే జనవరి నుంచి ప్రభుత్వం ఈ మొత్తాన్ని రూ.3 వేలకు పెంచుతుందన్నారు. గడిచిన నాలుగున్నరేళ్ల కాలంలో వరకవిపూడి పంచాయతీలో రూ.11.36 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను చేపట్టామని తెలిపారు. వరకవిపూడి గ్రామ సచివాలయ పరిధిలో తాజాగా రూ.1.43 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, ఇరిగేషన్ కాలువ రక్షణ గోడల లాంటి నిర్మాణాలు పూర్తి కాగా మంత్రి కాకాణి ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శి ఇసనాక రమేష్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, జెడ్పీటీసీ సభ్యురాలు ఎంబేటి శేషమ్మ, నాయకులు టంగుటూరు పద్మనాభరెడ్డి, కామిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, గూడూరు విష్ణుమోహన్‌రెడ్డి, కాల్తిరెడ్డి సుబ్రహ్మణ్యం, మన్నెం సుబ్రహ్మణ్యంగౌడ్, మన్నెం చిరంజీవులుగౌడ్, కూరపాటి కృష్ణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మహేష్‌రెడ్డి, కోటా శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట



ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో మందులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

విడవలూరు: రాష్ట్ర ప్రభుత్వం వైద్యానికి పెద్దపీట వేసిందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. విడవలూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్యమే లక్ష్యంగా గ్రామాల్లోనే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. కరోనా సమయంలో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండి నిత్యం వారి అవసరాలను తెలుసుకునేవారని, ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు సేవలందించారని గుర్తుచేశారు. ప్రతి సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఒక్కరూ అభినందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల లక్ష్మయ్య, మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, ప్రజాప్రతినిధులతోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు పూండ్ల అచ్యుత్‌రెడ్డి, కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, చంద్రారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, అయ్యప్ప, తహసీల్దార్ హమీద్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, వైద్యులు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన



మాట్లాడుతున్న ఏపీజీబీ బీఎం నిఖిల్‌కుమార్

మనుబోలు: బ్యాంకు ఖాతాదారులు డిజిటల్ లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ బి.నిఖిల్‌కుమార్ తెలిపారు. మండలంలోని కాగితాలపూరు గ్రామంలో శుక్రవారం ఆర్థిక అక్షరాస్యతపై బ్యాంకు ఖాతాదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్‌నెట్ బ్యాంకింగ్, ఫోన్‌పే, గూగుల్‌పే తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఏపీజీబీ ద్వారా అందజేస్తున్న వివిధ రకాల రుణాలు, వడ్డీ రేట్ల గురించి వివరించారు. అత్యధిక వడ్డీ చెల్లించే డిపాజిట్ స్కీంలైన ప్రగతిసిరి 666 రోజులు, 400 రోజుల స్కీంల గురించి వివరించారు. ఈ సదస్సులో క్యాషియర్ కృష్ణమనాయుడు, బీసీ శ్రీకాంత్, మెసెంజర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా సాగుదాం



సర్వేపల్లి నియోజకవర్గ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



హాజరైన సర్వేపల్లి నియోజకవర్గ నాయకులు

వైఎస్సార్‌సీపీ సర్వేపల్లి నియోజకవర్గ సమీక్ష సమావేశం నెల్లూరు రూరల్ నియోజకవర్గం కనుపర్తిపాడులోని వీపీఆర్ కన్వెన్షన్‌లో శుక్రవారం అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వేణుంబాక విజయసాయిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి, సర్వేపల్లి ఎమ్మెల్యే, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు కల్పలత వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు పలు సూచనలు, సలహాలు అందించారు. రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ కేడర్‌కు దిశా నిర్దేశం చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు నరసాపురం విద్యార్థులు



మస్తానమ్మ



అమూల్య



ఇందు

ఇందుకూరుపేట: త్వరలో గుంటూరులో జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఇందుకూరుపేట మండలంలోని నరసాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు పి.నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన ఆ పాఠశాలలో మాట్లాడుతూ నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ ఎంపికలు జరిగాయని, ఎం.మస్తానమ్మ (అండర్-17) 200 మీటర్లలో ప్రథమస్థానం, పి.అమూల్య (అండర్-17) 400 మీటర్లు, 800 మీటర్లలో ప్రథమస్థానం, పి.ఇందు (అండర్-14) హైజంప్‌లో ప్రథమస్థానం సాధించారని తెలిపారు. అలాగే ఈ ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని తెలిపారు. అథ్లెటిక్స్‌లో సత్తాచాటిన విద్యార్థులతోపాటు వ్యాయామ ఉపాధ్యాయుడు షేక్ ముజీర్‌ను సర్పంచ్ తాత సురేంద్ర, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ శ్రీశంతన్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

రోల్‌ప్లే, ఫోక్ డాన్స్ విజేతలకు ప్రశంసాపత్రాలు



ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విజేతలు

ఇందుకూరుపేట: మండలంలోని పల్లిపాడు డైట్ కళాశాలలో రెండు రోజులపాటు జరిగిన జిల్లా స్థాయి రోల్‌ప్లే, ఫోక్ డాన్స్ పోటీలు శుక్రవారం ముగిశాయి. రాష్ట్ర విద్యాశాఖ, ఎస్సీఈఆర్టీ జనాభా విద్య విభాగం ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. రోల్‌ప్లే పోటీల్లో ఆత్మకూరు జెడ్పీ ఉన్నత పాఠశాల, పల్లిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుచుకున్నారు. ఫోక్ డాన్స్ పోటీల్లో వావిళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల, నిడుముసలి ప్రాథమికోన్నత పాఠశాల, విందూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారని, వారికి ప్రశంసాపత్రాలు అందజేశామని డైట్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రమేష్ తెలిపారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు.

గ్రామాలకే స్పెషలిస్ట్ వైద్యులు



కొడవలూరు: రామన్నపాళెంలో ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ చిరంజీవి

- జెడ్పీ సీఈఓ చిరంజీవి

కొడవలూరు: గ్రామాలకే స్పెషలిస్ట్ వైద్యులు వచ్చి వైద్యసేవలందించడం ఓ బృహత్తర కార్యక్రమమని జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి అన్నారు. మండలంలోని రామన్నపాళెంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఆయన పరిశీలించారు. శిబిరానికి వచ్చిన రోగులు, వైద్యులతో మాట్లాడి వైద్యసేవల సక్రమంగా అందుతున్నాయా లేదా ఓపీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రులకు వెళ్లలేక బాధపడుతున్న ఎంతో మంది వృద్ధులకు ఆరోగ్య సురక్ష ఊరటనిస్తోందన్నారు. ఏ గ్రామంలో వైద్యశిబిరాన్ని పరిశీలించినా ప్రజలు పెద్ద ఎత్తున వచ్చి వైద్యసేవలను సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు. గ్రామీణుల ముంగిటకే కార్పొరేట్ వైద్యం అందేలా చేయడం శుభపరిణామమన్నారు. కంటి చూపు సమస్యలపై భారీగా వైద్యశిబిరానికి తరలివస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఉచితంగానే కంటి అద్దాలను కూడా పంపిణీ చేస్తుండడంతోపాటు శస్త్రచికిత్సలు చేస్తుండడంతో పెద్ద సంఖ్యలో సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఎం.రామకృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీ మాప్ జాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు కాకి శ్రీనివాసులు, పి.సాయి మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు డి.సురేష్ కుమార్, విజయకుమార్, శివకుమార్, హెచ్‌ఏ షఫీవుద్దీన్ పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షలో 480 మందికి వైద్యపరీక్షలు

కొడవలూరు మండలంలోని రామన్నపాళెంలో శుక్రవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో 480 మందికి డాక్టర్లు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. పలువురికి ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నారు. కీళ్ల, ఎముకల వైద్యనిపుణుడు నిఖిల్, కంటి వైద్యనిపుణురాలు నస్రీన్ భాను, పీహెచ్‌సీ వైద్యులు ఎం.రామకృష్ణ, జి.బాలచంద్రబాబు, లత వైద్యశిబిరానికి వచ్చిన రోగులకు పరీక్షలు నిర్వహించారు. అవ్వాతాతలకు ప్రభుత్వం మంజూరు చేసిన కంటి అద్దాలను సర్పంచ్ కాకి ధనమ్మ చేతులమీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కాకి శ్రీనివాసులు, కె.శ్యాంసుందర్‌రెడ్డి, పి.సాయి మోహన్‌రెడ్డి, కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఈఓపీఆర్డీ డేవిడ్, ఎంఎల్‌హెచ్‌పీ మాప్ జాన్, సీహెచ్‌ఓ టి.సోమశేఖర్, హెచ్‌ఏలు వెంకట్రావు, షఫీవుద్దీన్, సుధాకర్, పంచాయతీ కార్యదర్శులు డి.సురేష్‌కుమార్, జి.రాధాకృష్ణ, ఎస్.విజయలక్ష్మి, జి.జాలయ్య, ఎం.బ్రహ్మానందరెడ్డి, అంకమరాణి పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం

కోవూరు: నిరు పేదలకు కార్పొరేట్ వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి పేర్కొన్నారు. కోవూరులోని 4వ సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపిన ముఖ్యమంత్రులు వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలేనన్నారు. ఎంతోమంది పేదలకు కార్పొరేట్ వైద్యం చేరువైందంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ఆరోగ్య సురక్ష ఫలితమేనన్నారు. ఈ మహత్తర కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ పార్వతి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు శివుని నరసింహులురెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నలుబోలు సుబ్బారెడ్డి, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు సుధాకర్, ఎంపీడీఓ శ్రీహరి, తహసీల్దార్ పద్మజ, సర్పంచ్ విజయమ్మ, ఎంపీటీసీ సభ్యుడు వేణుగోపాల్, నాయకుడు అనూప్‌రెడ్డి పాల్గొన్నారు.



కొడవలూరు: శిబిరంలో కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ ధనమ్మ



ఆరోగ్య సురక్ష కరపత్రాలను ప్రదర్శిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



కోవూరు: మాట్లాడుతున్న నిరంజన్‌బాబురెడ్డి

పేదల ముంగిటకే వైద్యసేవలు

ఇందుకూరుపేట: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లోని పేద ప్రజల ముంగిటకే కార్పొరేట్ స్థాయి వైద్యసేవలను అందుబాటులోకి తీసుకువచ్చిందని డీసీఎమ్మెస్ డైరెక్టర్ గునుపాటి సురేష్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రం ఇందుకూరుపేటలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి విచ్చేసిన వారికి వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఆదర్శంగా నిలిచాయన్నారు. దివంగత ముఖ్యమంత్రి, తన తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి బాటలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నడుస్తూ వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి పేదల ఆరోగ్యానికి భరోసా ఇస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.నాగేంద్రబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు గురజాల బుజ్జిబాబు, వేళ్ల భానుచంద్రశేఖర్, వైస్ ఎంపీపీ మమత, సర్పంచ్ పద్మావతమ్మ, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన



మాట్లాడుతున్న కమిషన్ సభ్యురాలు పద్మావతి

నెల్లూరు(టౌన్): స్థానిక డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు శుక్రవారం బాలల హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో బాలికలు ఏవిధంగా అప్రమత్తంగా ఉండాలనే అంశాలను వివరించారు. బాలల హక్కుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐఓ, కళాశాల ప్రిన్సిపల్ ఆదూరు శ్రీనివాసులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి సేవలో..



నెల్లూరు(బృందావనం): నగరంలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కొలువైన శ్రీరాజరాజేశ్వరి అమ్మవారిని ఇన్వెస్ట్ ఇండియా సీనియర్ కన్సల్టెంట్(న్యూఢిల్లీ), ఐఏఎస్ అధికారిణి ఆరాధన శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఆర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ రత్నం జయరామ్, ధర్మకర్తల మండలి సభ్యులు ఆమెకు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అర్చకులు వేదాశీస్సులతో తీర్థప్రసాదాలను అందించారు.

ప్రభుత్వ పాఠశాలలో బొమ్మల కొలువు



పాఠశాలలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

నెల్లూరు(టౌన్): దసరా పండగను పురస్కరించుకుని శుక్రవారం స్థానిక వైఎస్సార్ నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ముందస్తు దసరా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బొమ్మల కొలువును ఏర్పాటు చేశారు. అనంతరం బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి దసరా పండగ, బొమ్మల కొలువు విశిష్టతలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

నెల్లూరు(బృందావనం): నెల్లూరు విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి సతీమణి కొండ్రెడ్డి సంధ్య వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని బాలాజీనగర్ గీతామయి వృద్ధుల ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు, కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండ్రెడ్డి సంధ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

నెల్లూరు(టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో డిగ్రీలో ఆయా కోర్సుల్లో మిగిలిన సీట్లలో ప్రవేశాల కోసం ఈ నెల 16వ తేదీ నుంచి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ గిరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీకాం ఆనర్స్ జనరల్-14, కంప్యూటర్ అప్లికేషన్స్-7, బ్యాంకింగ్ ఇన్సూరెన్స్-13, బీఏ ఆనర్స్ స్పెషల్ ఇంగ్లిషు-28, స్పెషల్ తెలుగు-26, పొలిటికల్ సైన్స్-25, హిస్టరీ-27, ఎకనామిక్స్ 23, బీఎస్సీ ఆనర్స్ జువాలజీ-15, ఆక్వా కల్చర్-14, బయోటెక్నాలజీ-11, హోమ్‌సైన్స్-5, బోటనీ-8, మ్యాథమ్యాటిక్స్-18, కెమిస్ట్రీ-27, ఫిజిక్స్-24, స్టాటిస్టిక్స్-9, కంప్యూటర్ సైన్స్-6 తదితర కోర్సుల్లో సీట్లు మిగిలాయని తెలిపారు. స్పాట్ అడ్మిషన్ల కోసం వచ్చే విద్యార్థినులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 8639734668 ఫోన్‌నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.